ప్రజాశక్తి
శుక్రవారం 7 జులై 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

అంతా గప్‌చుప్..

- ముప్పంగి సీపుడ్స్‌లో అమ్మోనియం లీకేజీ?
- అధికారులందరూ ప్రసన్నం..
- సమస్యలేదంటూ ప్రకటనలు
- భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలే కీలకం



బాధిత యువతులను పరామర్శిస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జరుగుమల్లి మండలంలోని వావిలేటి పాడులో ముప్పంగి సీపుడ్‌లో ఏం జరిగిందనేది ఇపుడు పెద్ద చర్చగా మారింది. ఒక్కసారిగా అక్కడ పనిచేస్తున్న కార్మికులు అస్వస్థతకు గురికావడంతో హుటాహుటిన రిమ్స్‌కు తరలించారు. వెంటనే అధికారులు రంగప్రవేశం చేశారు. నడపాల్సినదంతా నడిపారు. ఏమీ లేదని ప్రపంచానికి చెప్పేశారు. ఫ్యాక్టరీలోకి మీడియాను సైతం అనుమతించలేదు. అయితే 16 మంది కార్మికులు ఎందుకు హఠాత్తుగా అస్వస్థతకు గురయ్యారనేది వైద్యులు కూడా వెల్లడించలేదు. వైరల్ ఇన్‌ఫెక్షన్ కారణంగానే జ్వరాలు వచ్చాయని కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రకటించారు. అయితే అక్కడకు కార్మికుల పక్షాన సిఐటియు నేతలు కూడా వెళ్లి పరిశీలించారు. వీరి దృష్టికి అక్కడ అమోనియం లీకేజీ జరిగినట్లు వచ్చింది. స్వల్పంగా అమ్మోనియం గ్యాస్ లీకయిటన్లు తెలుస్తోంది. గతంలోనూ ఈ ఫ్యాక్టరీలో అమ్మోనియం లీకైన సంఘటనలూ ఉన్నాయి. అందరూ ఒడిశా నుంచి వచ్చిన కార్మికులు కావడంతో ఏమీ చెప్పలేకపోతున్నారు. విషయం వెలుగులోకి రాలేదు. ఇదే యజమాన్యానికి కలిసొచ్చింది. కార్మికులకు తెలుగు రానందున వారు చెప్పేవి ఇక్కడ స్థానికులకు అర్థం కావడం లేదు. ఇక్కడ సుమారు 600 మంది కార్మికులు పనిచేస్తున్నారు. షిఫ్టుకు 200 మంది చొప్పున పని చేస్తారు. అక్కడే ఫ్యాక్టరీ ఏర్పాటు చేసిన గదుల్లోనే బస చేస్తారు. అయితే సాయంత్రం షిఫ్టులో పనిచేసే కార్మికులు 6 గంటలకు లోపలకు వెళ్లారు. కొద్దిసేపటికే ముగ్గురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. వారి ▶ 2లో

జగనన్న సురక్షతో పరిపాలనా వ్యవస్థ ఇంటి ముందుకు.. 8లో

భూఆక్రమణ ఆరోపణలపై విచారణ జరిపించండి 3లో

వ్యవసాయ రంగం కుదేలు

- పెరుగుతున్న పెట్టుబడులు
- గిట్టుబాటు ధరల్లేక నష్టాల్లో రైతులు
- నేడు వ్యవసాయ సంక్షోభంపై సదస్సు
- హాజరుకానున్న ఏఐకేఎస్ నేత విజూకృష్ణన్, నాగేశ్వర్



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

వ్యవసాయ రంగం రోజురోజుకూ సంక్షోభంలోకి నెట్టబడుతోంది. ఒక వైపు పెట్టుబడులు రెట్టింపవుతున్నాయి. మరో వైపు గిట్టుబాటు ధరల్లేక రైతులు ఏం పంట పండించినా నష్టాల్లో కూరుకుపోతున్నారు. జిల్లాలో ప్రధాన పంటలు సాగుచేసే రైతులందరూ నిరుత్సాహంలోనే ఉన్నారు. కారణం ఏ పంటకూ గిట్టుబాటు ధరలు లేకపోవడమే.. ఆహార ధాన్యాల పంటలతో పాటు వాణిజ్య పంటలూ సమృద్ధిగా పండుతాయి. వీటికీ ధరల్లేవు. సాగు సమయంలో ఉన్న ధరలు దిగుబడుల సమయంలో ఉండటం లేదు. మార్కెట్‌లో వ్యాపారులు రైతులను నిలువునా దోచుకుంటున్నా పట్టించుకునే పరిస్థితి లేదు. ఉత్పత్తులను కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వ మార్కెటింగ్ సంస్థలు అలంకారప్రాయంగా మిగిలాయి. మార్కెట్‌లో పోటీ లేకపోవడంతో ప్రైవేటు వ్యాపారుల ఇష్టారాజ్యమైంది. దళారులే అంతా నిర్వహిస్తున్నారు. రైతుల పాత్ర నామ మాత్రంగా మారింది

సుబాబుల్ రైతులు దగా..

జిల్లాలో సుబాబుల్ లక్షన్నర ఎకరాల్లో సాగవుతోంది. సాగర్ చివరి భూముల్లో నీరు అందక 20 ఏళ్ల నుంచి సుబాబుల్ సాగు వైపు మొగ్గు చూపారు. మార్కెటింగ్ కమిటీల ద్వారా కొనుగోలు పద్ధతి 1999లోనే వచ్చింది. అప్పట్లో రైతుసంఘం పోరాటం ▶ 2లో

వ్యవసాయ రంగం కుదేలు

(మొదటిపేజీ తరువాయి)

ఫలితంగా ఈ ఒప్పందం జరిగింది. రానురానూ దీన్ని తూట్లు పొడిచారు. మార్కెట్ కమిటీ ద్వారా కొనుగోళ్లు లేవు. దళారులు బయటే కొంటున్నారు. టన్ను రూ.5 వేలకు కొనాల్సి ఉండగా ఇప్పుడు రూ.2 వేలకు కూడా కొనడం లేదు. రైతులను అమ్మికోకుండా కూడా దళారులు అడ్డు కుంటున్నారు. ఇలాంటి సంఘటన చీమకుర్తి మండలం నిప్పట్లపాడుతో జరిగింది. సుబాబుల్ రైతులు నిలువునా దోపిడికీ గురవుతున్నారు. ప్రభుత్వం మాత్రం మిల్లర్ల ప్రయోజనాల కోసం రైతులను వదిలేసింది.

శనగ రైతులదీ ఇదే దుస్థితి..

రబీలో శనగ పంట విస్తారంగా సాగు చేస్తున్నారు. పత్తికి ప్రత్యామ్నాయంగా శనగ సాగు పెరిగింది. గిద్దలూరు నియోజకవర్గంలోనూ ఈ సాగు ఉంది. కోస్తా ప్రాంతంలో విస్తారంగా ఉంది. అయితే పదేళ్ల క్రితం క్వింటా రూ.9 వేల ధర పలికింది. సాగుపై రైతులు బాగా మొగ్గు చూపారు. దీంతో ధరలు తగ్గించారు. కోల్ట్‌స్టోరేజీల్లోనే నిల్వలు పెట్టుకుంటున్నారు. శనగలను అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టల్స్‌లో వినియోగించవచ్చు. ప్రభుత్వమే సేకరించి మహిళలు, పిల్లలకు ఉప ఆహారంగా ఇస్తే పోష్టికాహార లోపం కూడా తగ్గుతుంది. వ్యాపారుల లాబీయింగు వల్ల శనగ రైతులు నష్టాల్లో ఉన్నారు.

మిర్చి ధరలు..ఒడిదుడుకులు..

మిర్చి సాగు సమయంలో క్వింటా రూ.25 వేలు అమ్ముతుంది. ధరలు బాగా ఉన్నాయని రైతులు పంట సాగు చేస్తారు. కాయలు కోసి ఎండబెట్టి అమ్మకానికి వచ్చే సరికి క్వింటాకు రూ.10 వేలు ధర తగ్గుతుంది. ఏం చేయలేక అమ్ము కుంటారు. మార్కెట్‌లో మిర్చి ధరలు నిలకడగా ఉండవు. ఇదంతా వ్యాపారుల మాయాజాలమే. ఎకరాకు లక్షకుపైగా పెట్టుబడి అవుతుంది. ధరల్లేక రైతులు నష్టాల పాలవుతున్నారు. మిర్చి మార్కెట్‌పై నియంత్రణ లేదు.

పొగాకు సాగు..

జిల్లాలో పొగాకు ప్రధాన వాణిజ్య పంటగా ఉంది. 80 మిలియన్ కిలోల వరకూ ఇక్కడే పండుతుంది. రాష్ట్రంలో పండే పంటలో 70 శాతం ప్రకాశం జిల్లాలోనే ఉంది. అయితే ఇక్కడ సంగతి తెలిసిందే. ప్రస్తుతం కిలో రూ.200 పలుకుతోంది. పొగాకు వేలంలో ఐటీసీతో పాటు మిగతా వ్యాపారులు సిండికేట్ అవుతారు. ఒకే ధర అమలులో ఉంటుంది. వేలం అంటే ధరల్లో వ్యత్యాసం ఉండాలి. అది కనిపించదు. గరిష్ట ధర, కనిష్ట ధర ఒకటే ఉంటుంది. రోజుల తరబడి ఇదే ధర ఇస్తారు. పైగా గరిష్ట ధరలు ఎక్కువ బేళ్లకు రావు. దీంతో వేలం జరిగే కొద్దీ సగటు ధర కూడా తగ్గుతూనే ఉంటుంది. గరిష్ట ధర రూ.200 ఉన్నా సగటు ధర వేలం ముగిసే నాటికి రూ.150 మించి ఉండదు.

కౌలు వ్యవసాయం..రుణాలు..

జిల్లాలో కౌలు రైతులు భారీగా పెరిగారు. జిల్లాలో ప్రస్తుతం లక్షన్నర వరకూ ఉన్నట్లు అంచనా. వీరికి గుర్తింపు కార్డులు ఇవ్వడం లేదు. రుణాలు లేవు. బ్యాంకుల్లో రుణాలు రావాలంటే పొలాలు తాకట్టు పెట్టాలి. వీరికి ఏమీ లేనందున ప్రైవేటు అప్పులతోనే కాలం వెళ్లదీస్తున్నారు. కౌలు రైతుల సంఖ్య పెరగడంతో కౌలు రేట్లు భారీగా పెంచారు. పొగాకు, మిర్చి, శనగ, కూరగాయల సాగులో కౌలు రైతులు ఎక్కువగా ఉన్నారు. కౌలు ఎకరానికి రూ.25 వేలకు పైనే ఉంది. అయితే సాగులో 50 శాతానికి పైగా ఇప్పుడు కౌలు రైతులున్నారు. వీరికి రుణాలు ఇవ్వడం లేదు.

ఇలా వ్యవసాయం అన్ని రకాలుగా సంక్షోభంలో కూరుకుపోతోంది. రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. పొగాకు రైతులు ఐదేళ్ల క్రితం ఇదేదారి పట్టారు. వ్యవసాయరంగంలో స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు జరిగితే రైతులకు గిట్టుబాటు ధర వస్తుంది. ఒక్కో రైతుకు రూ.12,500 పెట్టుబడి కింద ఇస్తే ఎందుకూ చాలడం లేదు. ప్రచారానికే ఉపయోగపడుతోంది. ఈ తరుణంలో 'వ్యవసాయ సంక్షోభం- పరిష్కారమార్గాలు' అనే అంశంపై రైతుసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నాడు ఒంగోలులోని బృందావనం కళ్యాణ వేదికలో సదస్సు జరుగుతుంది. దీనికి ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి విజూకృష్ణన్, ప్రొఫెసర్ నాగేశ్వర్ హాజ రవుతున్నారు. రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, కౌలు రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు పాల్గొంటారు. సదస్సును జయప్రదం చేయాలని రైతుసంఘం నాయకులు పమిడి వెంకట్రావు కోరారు.

అంతా గప్‌చుప్..

(మొదటిపేజీ తరువాయి)

పని ముగిసేలోపు మరో 13 మంది అస్వస్థతకు గురయ్యారు. వారికి సిబ్బంది యాజమాన్యం ప్రాథమిక వైద్యం చేయించారు. అక్కడ నుంచి వెంటనే రిమ్స్‌కు తరలించారు. వారికి పరీక్షలు కూడా సరిగా చేయకుండానే వైరల్ ఇన్‌ఫెక్షన్‌గా తేల్చారు. 16 మందిని గురువారం సాయంత్రానికి ఇంటికి పంపారు. అందరూ కోలుకున్నందున సమస్య ముగిసిందని యాజమాన్యం ఊపిరి పీల్చుకుంది. అయితే కార్మికుల అస్వస్థతకు కారణం అమ్మోనియం స్వల్పంగా లీకవ్వడమే కారణంగా భావిస్తున్నారు. దాన్ని యజమాన్యం గుట్టుగా దాచింది. అధికారులను ప్రసన్నం చేసుకున్నారు. అందరితోనూ ప్రమాదం ఏమీలేదని ప్రకటనలు ఇచ్చేలా చేశారు. తెరవెనుక ఏం జరిగిందో చెప్పాల్సిన అవసరం లేదు. ఫ్యాక్టరీలో తనిఖీలు చేశారా? ఫ్యాక్టరీల అధికారులు ఏంచేశారు? ప్రమాదానికి కారణాలను తేల్చారా? లేక యాజమాన్యం చెప్పినట్లు చెప్పారా? అంటే అంతా ఫ్యాక్టరీకి అనుకూలంగా చెప్పేశారు. లీకేజీ కారణంగా ఇంత మంది ఒక్కసారిగా అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. అంతాగుట్టుగా కథను నడిపారు. గురువారం నాడు అక్కడకు వెళ్లిన సిఐటియూ నేతలకు పలువురు అమ్మోనియం గ్యాస్ లీకేజీ జరిగినట్లు చెప్పారు. కొందరు ఏమీ లేదని చెప్పారు కూడా. ఏదేమైనా ఇంత మంది అస్వస్థతకు గురికావడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికైనా యాజమాన్యం భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. అధికారులు కూడా ఇప్పుడు పెద్ద ప్రమాదం ఏమీలేనందున దాన్ని దాచేయవచ్చు. అదే ప్రాణనష్టం భారీగా జరిగి ఉంటే అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది ఆలోచించాలి. ఫ్యాక్టరీల్లో భద్రతా చర్యలపై దృష్టి సారించాలి. తనిఖీలు చేయాలి. కార్మికులకు రక్షణ కల్పించాలని సిఐటియు నేత కాలం సుబ్బారావు కోరారు. ఈ ఘటనపై పలు అనుమానాలున్నాయన్నారు. అమోనియం స్వల్పంగా లీక్ కావడం వల్లనే అస్వస్థతకు గురయ్యారని అభిప్రాయపడ్డారు. ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. జిల్లాలోని ఫ్యాక్టరీల్లో భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు కూడా చర్యలు తీసుకోవాలన్నారు.

గొట్లగట్టులో జగనన్న సురక్ష

కొనకనమిట్ల : మండల పరిధిలోని గొట్లగట్టు సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశల్దారు బి.ప్రసాద్, ఇఒఆర్‌డి రావూరి జానార్ధన్, చిన్నారికట్ల సింగిల్‌విండో అధ్యక్షుడు ఉడముల కాశిరెడ్డి, విఆర్‌ఒ దిలీప్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సచివాల సిబ్బంది, వాలంటరీలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి-టంగుటూరు

పర్యావరణ పరిరక్షణ అందరి లక్ష్యం కావాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మల్లవరపు జయరామిరెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని జయవరం గ్రామంలో కమ్యూనిటీ సర్వీసెస్ ప్రాజెక్టులో భాగంగా మలినేని సుశీలమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జయరామిరెడ్డి మాట్లాడుతూ భావితరాలకు ఆస్తులు అందించాల్సిన అవసరం లేదని, వారు ఆరోగ్యంగా ఉండేందుకు కలుషితం లేని పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ వారికి ఇష్టమైన రోజును ఎంచుకుని ఓ మొక్కను నాటేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సోషల్ మీడియా విభాగం జిల్లా కో కన్వీనర్ మేదరమెట్ల భరత్ రెడ్డి, విద్యార్థులు కె.దీక్షిత, సిహెచ్.సుకన్య, కుమారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

8న రైతుల ఖాతాల్లో నష్టపరిహారం నగదు జమ

ప్రజాశక్తి-పొదిలి

గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలు నష్టపోయిన రైతుల బ్యాంకు ఖాతాల్లో ఈ నెల 8న నష్టపరిహారం జమ చేయనున్నట్లు ఎఒ జైనులాబ్ధిన్ తెలిపారు. రైతుల జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. మండలంలో 6491.58 హెక్టార్లలో కంది పంట నష్టపోయిన 5,909 మందికి రూ.23,31,34,093, 760.94 ఎకరాలలో పత్తి నష్టపోయిన 315 మంది రైతుల ఖాతాల్లో రూ.12,78,365 నగదు జమ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

పెట్రోల్ సీసాతో పోలీసుస్టేషన్ ఎదుట మహిళ ఆందోళన

- భర్త మరో వివాహం చేసుకున్నాడు అంటూ ఆవేదన
- పోలీస్ స్టేషన్ ఎదుట బిడ్డతో సహా భార్య బైఠాయింపు
- మహిళను అదుపులోకి తీసుకొని విచారిస్తున్న పోలీసులు



బిడ్డతో పోలీస్ స్టేషన్ ఎదుట తన కూతురుతో బైఠాయించిన మహిళ

ప్రజాశక్తి-చీరాల

కట్టుకున్న భర్త మరొకరిని పెళ్లిచేసుకొని తనను తన బిడ్డను వేధిస్తున్నాడని, తమకు న్యాయం చేయాలని చీరాల ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట ఓ వివాహిత పెట్రోల్ సీసాతో బైఠాయించింది. చీరాల విఠల్ నగర్‌కు చెందిన ఉప్పుచర్ల అరుణకు అదే ప్రాంతానికి చెందిన బాబురావుతో గత 13 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఆరేళ్ల పాప ఉంది. అయితే బాబూరావు పెళ్లైన రెండేళ్లకే మరొకరిని పెళ్లి చేసుకున్నాడు. దీంతో మొదటి భార్య అయిన అరుణతో విడాకులు తీసుకోవాలని కొంతకాలంగా ఆమెను వేధిస్తున్నాడు. చివరికి వీరిని అడ్డు తొలగించుకునేందుకు పుట్టింటి వద్ద ఉంటున్న తనపై, తన కూతురుపై భర్తతో కలిసి అత్తింటి కుటుంబ సభ్యులు దాడికి యత్నించారని అరుణ మీడియాతో చెప్పారు. దీంతో తనకు, తన కూతురుకు భర్త, అత్తింటి వారి నుంచి ప్రాణహాని ఉందని, పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. చేసేది లేక చివరికి ఈ నిర్ణయానికి వచ్చినట్లు ఆమె తెలిపింది. పోలీసు స్టేషన్ ఎదుట పెట్రోల్‌తో ఆత్మహత్యా యత్నాన్ని పలువురు స్థానికులు నిలువరించారు. వెంటనే పోలీసులు బయటకు చేరుకొని పెట్రోల్ సీసాను లాక్కొని ఆమెను అదుపులోకి తీసుకున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో..

మహిళా పోలీసులదే కీలక పాత్ర: ఎస్‌పి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో సచివాలయ మహిళా పోలీసులు కీలకపాత్ర పోషిస్తున్నారని ఎస్‌పి వకుల్ జిందాల్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జూన్ నెలలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన టాప్-5 గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీసులను ఎస్‌పి అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. సచివాలయ మహిళా పోలీసుల పనితీరును మెరుగు పరిచి వారిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించడానికి జిల్లా ఎస్‌పి ఈ ఏడాది మే 30 నుంచి కొత్తగా 20 అంశాలతో కూడిన టాస్క్ లను మహిళా పోలీస్ డ్యూటీ ట్రాకర్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. వారు నిర్వర్తిస్తున్న విధులను ఎప్పటికప్పుడు గూగుల్ షీట్‌లో పొందుపరచగా సంబంధిత స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ధృవీకరించిన అనంతరం వారు చేసిన టాస్క్ ఆధారంగా పాయింట్‌లను కేటాయించినట్లు తెలిపారు. ఈ టాస్క్ పాయింట్ల ఆధారంగా జూన్ నెలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సచివాలయ మహిళా పోలీసులను ఎస్‌పి అభినందించారు. ఈ మేరకు ఎస్ నాగజ్యోతి, బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్, సిహెచ్ కామేశ్వరి, చీరాల రూరల్ పోలీస్ స్టేషన్, ఎస్ శివపార్వతి, బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్, ఎన్ జయన్ పర్చేచా, బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్, బి లీలావతి, చందోలు పోలీస్ స్టేషన్‌లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం వారు సమర్థవం తంగా విధులు నిర్వహించిన విధానాన్ని గురించి జిల్లా ఎస్‌పి అడిగి తెలుసుకున్నారు. మిగిలినవారు కూడా వీరిని స్ఫూర్తిగా తీసుకొని సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ ఎప్పుడైతే సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించిన విధులకు తగిన గుర్తింపు వస్తుందో అప్పుడు ఇంకా ఉత్సాహవంతంగా ఇతరులకు ఆదర్శంగా విధులు నిర్వహించడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రజలకు దిశ యాప్, సైబర్ నేరాల గురించి అవగాహన కలిగించాలన్నారు. భార్యాభర్తల, కుటుంబ వివాదాలు పరిష్కరించడానికి వారికి కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. అప్పటికి వారి సమస్య పరిష్కారం కాని పక్షంలో పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు తెలియపరచాలన్నారు.



ప్రతిభ కనపర్చిన గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీసులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న బాపట్ల జిల్లా ఎస్‌పి

పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-చీరాల

చీరాల పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో చీరాల ట్రాఫిక్ పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా చీరాల గడియారస్తంభం, ముంతావారిసెంటర్, మసీదు కూడలి, బోస్‌నగర్, బస్టాండ్ కూడళ్లలో పలు వాహనాలు ఆపి లైసెన్సులు, ఆర్‌సీలు, బండికి సంబంధించిన కాగితాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ సాల్మన్‌రాజ్ మాట్లాడుతూ చీరాల పట్టణంలో రోజురోజుకు వాహనదారులు విచ్చలవిడిగా రాకపోకలు సాగిస్తున్నారన్నారు. దీంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ముఖ్యంగా చిన్నపిల్లలు వాహనాలతో రోడ్లపైకి త్రిపుల్ డ్రైవింగ్ చేస్తున్న సంఘటనలు అధికంగా ఉన్నాయన్నారు. వీరిని ఎన్నిసార్లు హెచ్చరించినా మార్పు కన్పించడంలేదని, తల్లిదండ్రులు ఇప్పటికైనా స్పందించి పిల్లలకు వాహనాలు వారికి ఇచ్చి రోడ్లపైకి పంపరాదని అన్నారు. అదేవిధంగా ఆటోలు, ఇతర వాహనదారులు రాకపోకలు సాగించే సమయంలో సంబంధిత పత్రాలను విధిగా కలిగివుండాలని అన్నారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న చలానాలను వెంటనే చెల్లించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించే వాహనదారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ దాస్, కానిస్టేబుల్ పలువురు పాల్గొన్నారు.

భూ ఆక్రమణ ఆరోపణలపై విచారణ జరపండి

కలెక్టర్‌కు మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి స్వీయ ఫిర్యాదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

తనపై, కుటుంబ సభ్యులపై వచ్చిన భూ ఆక్రమణ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని మార్కాపురం ఎమ్మెల్యే కె నాగార్జునరెడ్డి కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌ను కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ దినేష్ కుమార్‌ను కలిసి ఎమ్మెల్యే స్వయంగా అర్జీ ఇచ్చారు. భూ ఆక్రమణ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని ఎమ్మెల్యే ఫిర్యాదు చేయటం చర్చనీయాంశంగా మారింది. అనంతరం పాత్రికేయులతో మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో గత నాలుగేళ్ల కాలంలో నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. పొదిలి పెద్ద చెరువు ప్రాజెక్ట్ 20 సంవత్సరాల కలని, నేటికీ పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ముఖ్యమంత్రి ప్రోత్సాహంతో పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు పొదిలి పెద్ద చెరువుకు శంకుస్థాపన చేసి గతవారం పనులు మొదలు పెట్టామని అన్నారు. ముల్లా వారికి బిసి సర్టిఫికెట్ లేదని, సిఎం సహాయ సహకారాలతో వారికి బిసి ఇ సర్టిఫికెట్ ఇప్పించామన్నారు. పశ్చిమ ప్రాంతం మార్కాపురానికి మెడికల్ కాలేజీ వరమని, రూ.450 కోట్ల ప్రాజెక్ట్‌తో ప్రకటించారన్నారు. మార్కాపురం నియోజక వర్గంలో ప్రతి పల్లె, గ్రామంలో, వార్డులో అందరికీ తన గురించి తెలుసని, ఎలాంటి గౌరవం ఇస్తారో ప్రజలందరూ గమనిస్తారన్నారు. ఏ ఒక్కరినీ కించపరిచింది లేదని, తీసివేసింది లేదని అన్నారు. తమ కుటుంబం 50 సంవత్సరాలుగా రాజకీయాలలో ఉందని, వందలు వేల కోట్లు, వేలాది ఎకరాలు ఉన్నట్లు కథనాలు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమం ఏ ఒక్కటీ పోకుండా నూటికి 100 శాతం ఫలితాలు ఇచ్చే విధంగా ముందుకెళ్తున్నామన్నారు. ముఖ్య నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మహిళలు, యువత, విద్యార్థులలో స్ఫూర్తి నింపుతున్నామన్నారు. ముఖ్యమంత్రి ఆశయాల మేరకు ముందు కెళుతున్నామని, సమస్యతో వస్తే పరిష్కారమయ్యే వరకు కృషి చేస్తున్నామని అన్నారు. ఎక్కడా స్వార్థం లేకుండా పని చేస్తున్నానని, మార్కాపురం నియోజకవర్గంలోని 4 మండలాలు, పట్టణాలలోని నాయకులు వచ్చి అర్జీ ఇచ్చారని పేర్కొన్నారు. పత్రికలు, వివిధ ఛానల్స్‌లో తనపై వచ్చిన కథనాలపై విచారణ జరిపించాలని కలెక్టర్‌కి ఫిర్యాదు చేశానన్నారు. ఒక్క ఎకరా, అర ఎకరా, సెంట్ భూమి మీ కుటుంబం వ్యక్తులు తీసుకున్నట్లు నిజ నిర్ధారణ చేస్తే వారిని తాను పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్లి ఫిర్యాదు చేస్తానన్నారు. తన తండ్రి కెపి కొండారెడ్డి, తన మామ ఉడుముల శ్రీనివాసుల రెడ్డి ఎమ్మెల్యేలుగా ఉన్నప్పుడు ఆయా నియోజకవర్గాల అభివృద్ధికి కృషి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తనపై, తన కుటుంబ సభ్యులపై వచ్చిన ఆరోపణలపై క్షేత్ర స్థాయిలో నిజాలు పరిశీలించాలని సూచించారు. ఎవరో ఏదో చెప్పారని, ఆధారాలు లేకుండా కథనాలు ప్రచురించవద్దని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు వైసిపి రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ మీర్జా షంషేర్ అలీ బేగ్, వైసిపి నాయకులు మారెడ్డి రామసుబ్బారెడ్డి, బొగ్గరపు శేషయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కొనిజేడు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ఖాదర్‌బాషా

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని కొనిజేడు గ్రామ సమీపంలోని చాకలి మాన్యం వద్ద ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. ఈ ప్రమాదంలో జక్కుల నరసింహారావు(36) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కొనిజేడు గ్రామానికి చెందిన జక్కుల నరసింహారావు గురువారం కొనిజేడు నుంచి ఒంగోలు వైపు వెళుతుండగా ఎర్ర గ్రావెల్ తోలే ఖాళీ ట్రాక్టర్ ఒంగోలు నుంచి కొనిజేడు వైపు వస్తూ నరసింహారావు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో నరసింహారావు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న టంగుటూరు ఎస్ఐ షేక్ ఖాదర్ బాషా సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కజొన్న డబ్బులు ఎగ్గొట్టిన నిందితులపై కేసు నమోదు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని రాచూరు గ్రామంలో పలువురు రైతుల వద్ద మొక్కజొన్న పంటను కొనుగోలు చేసి ఇవ్వవలసిన సొమ్మును ఇవ్వనందుకు రైతులు ఫిర్యాదు మేరకు భట్టిప్రోలు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్యాల పాములరావు అనే ప్రయివేటు వ్యాపారి ద్వారా కొందరు రైతులు పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి మండలం పగడవరం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు సుమారు 39 టన్నుల మొక్కజొన్న పంటను కొనుగోలు చేశారు. అయితే అనేక మంది రైతులకు నెలలు గడిచినా సొమ్ము చెల్లించలేదు. గ్రామానికి చెందిన కటారి ప్రసాద్, సంకటి సాంబశివరావులకు ఇంకా రూ.4.70 లక్షలు రావాల్సి ఉందని, వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

4వ రోజుకు చేరిన రిలే దీక్షలు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

అంబేద్కర్ సామాజిక భవనానికి స్థలం కేటాయించడానికి ఇక్కడి పాలకులకు మనసు రావడం లేదని ధర్నాలు, ర్యాలీలు, దీక్షలు, చేయాల్సిన పరిస్థితి దురదృష్టమని సిపిఎం నాయకులు సోమయ్య, గాలి వెంకటరామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ సామాజిక భవనానికి స్థలం కేటాయించాలని కోరుతూ ఉప కలెక్టర్ కార్యాలయం ఎదుట దళిత సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు గురువారం నాటికి నాలుగో రోజుకు చేరాయి. ఈ దీక్షలకు సిపిఎం, సిఐటియు నాయకులు గాలి వెంకటరామిరెడ్డి, సోమయ్య, రఫీ, రూబెన్, బాలనాగయ్య మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇప్పటికైనా పాలకులు, అధికారులు మేలుకొని సామాజిక భవనానికి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉప కలెక్టర్ సేతుమాధవన్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో బిఎస్‌పి అధ్యక్షుడు సండ్రపాటి కాలేబు, బహుజన సైన్యం అధ్యక్షుడు జనుమాల నాగయ్య, చెన్నకేశవులు, డివైఎఫ్ఐ నాయకులు ఏనుగుల సురేష్‌కుమార్, కెవిపిఎస్ నాయకులు జవ్వాజి రాజు, లింగయ్య, సుబ్బు, పావయ్య, బాబి, చిట్టిబాబు, చిన్నబాబు, నాసర్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ నర్గీస్

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-చెరుకుపల్లి

ఈ నెల 8,9 తేదీలలో నరసరావుపేటలో జరిగే రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఐదుగురు ఎంపికైనట్లు ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ నర్గీస్ కాజీ తెలిపారు. సీనియర్ విభాగంలో ఇద్దరు, జూనియర్ విభాగంలో ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. సీనియర్ విభాగంలో ఎం అఖిల్ సాయి, జూనియర్ విభాగంలో జె చరణ్ తేజ, టిఎల్ నారాయణ, డి చందన్ రఘు, వి ఈశ్వర్ నాగ శంకర్ ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ పైనం ఏడుకొండలరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది విద్యార్థులను అభినందించారు.



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్

కిమ్స్ వైద్య శిబిరంలో 220 మందికి పరీక్షలు

ప్రజాశక్తి-పంగులూరు

పంగులూరు మండలంలోని నూజెళ్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ వైసిపి నాయకులు కొండ్రగుంట రవిబాబు, తాళ్లూరి నరేంద్ర ఆధ్వర్యంలో కిమ్స్ హాస్పిటల్స్ ఒంగోలు సహకారంతో గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో 220 మందికి పరీక్షలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరానికి ప్రజల భారీగా హాజరైనట్లు కిమ్స్ వైద్య శిబిర సమన్వయకర్త తాళ్లూరి రామాంజనేయులు, కిమ్స్ అద్దంకి ఏరియా పిఆర్ఓ పి కాలేషావలి తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో కిమ్స్ వైద్యులు డాక్టర్ బైపనేని రామాంజనేయులు సుమారు 220 మంది రోగులకు బిపి, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి, వారికి ఒక వారం రోజులకు సరిపడా మందులను కూడా ఉచితంగా అందజేశారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 20 మందికి కంటి లోపల శుక్లములు, పొరలు ఉన్నవారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఒంగోలులోని కిమ్స్ హాస్పిటల్స్‌లో ఉచితంగా ఆపరేషన్స్ నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నూజెళ్లపల్లి సచివాలయం ఏఎన్ఎం లత, ఆశ వర్కర్లు, కిమ్స్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



బోడవాడలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న ఆమంచి కృష్ణమోహన్

అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పర్చూరు: పర్చూరు మండలం బోడవాడ గ్రామలోని ఎస్సీ కాలనీలో సిసి రోడ్డు, ఇతర పలు అభివృద్ధి కార్యక్రమాలకు పర్చూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్ శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. ఆయన వెంట ముప్పాళ్ల రాఘవయ్య, కొరాకుల ఇస్సాకు, పర్చూరు సర్పంచ్ మళ్ళా అంజమ్మ, శ్రీనివాసరావు, పర్చూరు మాజీ ఉప సర్పంచ్ గాదె సురేష్, శ్రీనివాసరావు, కంచనపల్లి రమేష్, బోడవాడ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-రేపల్లె

బాబూ జగ్జీవన్‌రాం సేవలు చిరస్మరణీయమని టిడిపి నాయకులు క్రాంతి సుమన్‌బాబు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో జగ్జీవన్ రావు 37వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా క్రాంతి సుమన్ బాబు మాట్లాడుతూ జగ్జీవన్‌రాం, అంబేద్కర్ వంటి మహనీయుల స్ఫూర్తితో యువత నవ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని అన్నారు. జగ్జీవన్‌రాం స్వాతంత్ర్య సమరయోధుడిగా, సంఘ సంస్కర్తగా, సమత వాదిగా భారతదేశానికి సేవలను అందించారని చెప్పారు. కుల రహిత సమాజం కోసం జీవితాంతం కృషి చేసిన నేత అని కొనియాడారు. నేడు ఉద్యోగులకు ఎంతో ఉపయోగపడుతున్న ప్రావిడెంట్ ఫండ్ రూపకర్త బాబూ జగ్జీవన్ రాం అని తెలిపారు. ఎన్నో ఉద్యమాలు, ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆశాజ్యోతిగా నిలిచారని తెలిపారు. ఆనాటి సమాజంలో చదువుకు దూరమై దుర్భర జీవితాన్ని గడుపుతున్న.. పీడిత దళిత దీన జనుల కోసం శ్రమించిన సంస్కరణల యోధుడు జగ్జీవన్‌రామ్ అని పేర్కొన్నారు. భారతదేశంలో వలసవాదానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరుగుతున్న స్వాతంత్ర్యోద్యమ పోరాటంతో పాటు కుల నిర్మూలన, సామాజిక సంస్కరణ ఉద్యమాల్లో కీలకంగా పని చేశారని చెప్పారు. కార్యక్రమంలో కూచిపూడి మోహనరావు, ఆలూరి డానియెల్, దున్నా జయప్రద, ఆలూరి సురేష్, నున్న జయరావు, చిలకా చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.





రేపల్లె, భట్టిప్రోలుల్లో బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి

భట్టిప్రోలు: మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త డాక్టర్ బాబూ జగ్జీవన్ రాం వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తునుగుంట్ల సాయిబాబా పలువురు టిడిపి నాయకులు, దళిత నాయకులు జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాచూరు గ్రామంలో జగ్జీవన్‌రాం విగ్రహానికి దళిత నాయకులు చిలకా రత్నబాబు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కుక్కల వెంకటేశ్వరరావు, కంభం సుధీర్, రవి తదితరులు ఉన్నారు.

చీరాల: అంటరానితనాన్ని రూపుమాపేందుకు కృషి చేసిన డాక్టర్ బాబూ జగ్జీవన్‌రాం మహనీయుడని ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు బుడంగుంట్ల లక్ష్మీ నరసయ్య మాదిగ అన్నారు. గురువారం ఆయన 37వ వర్ధంతి సందర్భంగా చీరాల ముక్కోణం పార్క్ సెంటర్లో ఉన్న డాక్టర్ బాబూ జగ్జీవన్ రాం విగ్రహానికి చీరాల బాబూ జగ్జీవన్‌రాం విగ్రహ నిర్మాణ కమిటీ, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మహాజన సోషలిస్టు పార్టీ, మాదిగ విద్యార్థి సమాఖ్య, మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పి బాపట్ల జిల్లా అధ్యక్షులు బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య మాదిగ, జిలకర రమేష్, ఉసురుపాటి సురేష్, దుడ్డు సైమన్, వీరమల్లు కోటేశ్వరరావు, దుడ్డు వందనం, ఎంఈఎఫ్ నాయకులు దుడ్డు వెంకటేశ్వర్లు, కొమ్మూరు లైమ్, ఎంఆర్‌పిఎస్ నాయకులు తేళ్ల అవినాష్, దుడ్డు రాంబాబు, అప్పారావు పాల్గొన్నారు.

బాపట్ల: మాజీ ఉపరాష్ట్రపతి బాబు జగ్జీవన్ రామ్ బహుజన బంధువు అని బాపట్ల ఏబీఎం ప్రాపర్టీస్ ప్రొటక్షన్ కమిటీ అధ్యక్షులు జాన్ ప్రసన్నబాబు అన్నారు. గురువారం జగ్జీవన్‌రాం 37వ వర్ధంతి సందర్భంగా బాపట్ల ఏబీఎం హైస్కూల్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బాపట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు పఠాన్ రాజేష్ మాట్లాడుతూ బాబు జగజ్జీవన్‌రాం కేంద్ర వ్యవసాయ మంత్రిగా, కరువు, దుర్భిక్ష పరిస్థితులలో వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధించి దేశాన్ని హరిత విప్లవం దిశగా నడిపించారన్నారు. కేంద్ర పౌరసరఫరాల మంత్రిగా, సామాన్య ప్రజానీకానికి నిత్యావసర వస్తువులు చౌకగా లభించేలా పౌర సరఫరా పంపిణీ వ్యవస్థను ఆనాడే ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్ బక్కా రోశయ్య, కాంగ్రెస్ నాయకులు దోనేపూడి రవి, జి సుగంధర్, డేవిడ్, రాంబాబు పాల్గొన్నారు.





చీరాల, బాపట్లలో బాబూ జగ్జీవన్‌రాంకు నివాళి అర్పిస్తున్న నాయకులు

టిడిపి శ్రేణులతో ఎమ్మెల్యే సమీక్ష

- వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడితేనే రాష్ట్రానికి భవిష్యత్
- అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అద్దంకి

సంతమాగులూరు మండలం అడ్డరోడ్డులోని గెస్ట్ హౌస్‌లో బల్లికురవ, సంతమాగులూరు మండలాలలోని కొమ్మాలపాడు, వల్లాపల్లి, అంబడిపూడి, కొమ్మినేనివారి పాలెం గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అవినీతి, అక్రమాలు, అఘాయిత్యాలే తప్ప ఉపాధి, అభివృద్ధి ఊసే లేని వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడితేనే రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుందని అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పేదప్రజల సమస్యలను ఖచ్చితంగా పరిష్కరించే దిశగా ప్రణాళికలు ఉంటాయని అన్నారు. ముఖ్యంగా కుటుంబ సాధికారక సారథులు ఓటరు పేజీ నేస్తం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, ఓటర్ జాబితాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ అధికార వైసిపి కుతంత్రాలు, కుయుక్తులను తిప్పికొట్టాలని, ఓటర్ వెరిఫికేషన్ పక్కాగా అందరూ చేపట్టాలని, ఓట్ల చేరికలు, తొలగింపులు, డబుల్ ఎంట్రీలపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. టిడిపి సానుభూతిపరులై 18సం నిండిన యువతీ యువకులను గుర్తించి ఓటరు నమోదు ప్రక్రియను చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మైనారిటీలపై దాడులు పెరిగిపోయాయని, నంద్యాలలో అబ్దుల్ సలాం కుటుంబం బలవన్మరణం, నరసరావుపేటలో మసీదు ఆస్తుల పరిరక్షణ కోసం పోరాడిన ముస్లిం సోదరుడిని అత్యంత దారుణంగా హత్యచేయడం, బాగా చదువుకునే మిస్బాను వేధించడంతో ఆత్మహత్య చేసుకోవడం, ఇలా వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దాదాపు 78 ముస్లిం మైనారిటీ కుటుంబాలపై వేధింపులకు పాల్పడ్డారని అన్నారు. ఈ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు రక్షణలేదని స్పష్టమైందన్నారు. టిడిపి హయాంలో మైనారిటీ యువతులకు దుల్హన్ పథకం ద్వారా 50 వేలు అందించామని, లక్ష రూపాయలు అందిస్తానన్న జగన్‌రెడ్డి వధూవరులు ఇద్దరికీ 10వ తరగతి నిబంధన పెట్టి లబ్ధిదారులను తగ్గించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరకొర పథకాలున్నా పొందేందుకు వీలులేని అడ్డగోలు నిబంధనలు విధించారని అన్నారు. వైసీపీ పాలనలో ఆర్థికంగానూ, సామాజికంగానూ మైనార్టీలకు తీరని అన్యాయం జరిగిందని, టిడిపి మైనార్టీల రక్షణ, సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు.



బల్లికురవ, సంతమాగులూరు మండలాలలోని తెలుగుదేశం పార్టీ నాయకులతో, కార్యకర్తలతో శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లింపు

నాడు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ ఎస్టీల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు వారికి కేటాయించిన నిధులను మళ్లించకుండా కేవలం వారికే ఉపయోగపడే విధంగా రూపొందించిన చట్టాలను టిడిపి తూచా తప్పకుండా అమలు చేసిందని, నేటి వైసిపి ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లించిందని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం సబ్ ప్లాన్ నిధులు రూ.7,200 కోట్లు దారి మళ్లించారని అన్నారు. 11,500 ఎకరాల దళితుల అసైన్డ్ భూముల్ని బలవంతంగా లాక్కున్నారని పేర్కొన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, విదేశీ విద్య, కులాంతర వివాహాలకు ఆర్థిక సాయం, పారిశ్రామిక రాయితీలు వంటి 28 ఎస్‌సి పథకాలు, కేంద్ర ప్రాయోజిత పథకాలు రద్దు చేయడం దళితులకు నమ్మక ద్రోహం చేయడం కాదా అని ఆవేదన వ్యక్తం చేశారు. 1972వ సంవత్సరంలో రాష్ట్రంలో షెడ్యూల్ క్యాస్ట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. కాంగ్రెస్, తెలుగుదేశం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళితులకు అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలుచేశారు. లక్షలాది మంది నిరుపేద దళిత కుటుంబాలను పలు కార్యక్రమాల ద్వారా ఆదుకున్నట్లు తెలిపారు. దీంతో స్వయంశక్తితో నిరుద్యోగులు వాళ్ళ కాళ్ళ మీద వారు నిలబడగలిగారన్నారు. ఇలాంటి తోడ్పాటును అందించిన ఘనత టిడిపి హయాంలో ఉన్న ఎస్సీ కార్పొరేషన్‌కు ఉందని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా చేపట్టిన పథకాలను, కార్యక్రమాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. దళారుల వద్ద ఉండిపోయిన రూ.67 కోట్లు రాబట్టడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. టిడిపి హయాంలో ఎస్సీ ఎస్టీ విద్యార్థులు ఇతర దేశాలలో విద్యను అభ్యసించేందుకు డాక్టర్ అంబేద్కర్ విదేశీ విద్య పథకాన్ని అమలు చేస్తే, నేడు దానిని జగనన్న విదేశీ విద్యగా మార్చడం బలహీన వర్గాలపై జగన్‌రెడ్డి కపట ప్రేమకు నిదర్శనమని అన్నారు. దళితుల హక్కుల్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, అంబేద్కర్ ఆశయాలను తుంగలో తొక్కుతున్న వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రతి ఒక్క దళితుడు సిద్ధం కావాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా 60 వేల ఎకరాలకు రిజిస్ట్రేషన్ చేయించి బడుగు బలహీన వర్గాలకు భూ హక్కు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే గొట్టిపాటి తెలిపారు.

ఉత్తమ బోధన, స్థానికుల ఆదరణతో

అత్యుత్తమ ఫలితాలు

చీమకుర్తి సాయికిరణ్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్, నేతాజీ హైస్కూల్

ప్రజాశక్తి -మద్దిపాడు

నాలుగు దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతంలో ఉత్తమ బోధన, స్థానికుల ఆదరణతో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు నేతాజీ హై స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చీమకుర్తి సాయికిరణ్ తెలిపారు. 2023 పదవ తరగతి ఫలితాలలో తమ విజయానికి కారణం కూడా ఇదేనన్నారు. విద్యారంగంలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా ఆధునిక బోధనా పద్ధతులు అవలంబించడం, ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ కనబరచడం వంటి అంశాలు అత్యుత్తమ ఫలితాలు రాబట్టడానికి దోహదపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. 1982లో తమ తండ్రి చీమకుర్తి బాబూరావు ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు తెలుగు మీడియంలో కాన్వెంట్ ను ఇక్కడ ప్రారంభించినట్లు గుర్తు చేశారు. నాటి నుంచి అంచెలంచలుగా విస్తరించి 2010 సంవత్సరంలో హైస్కూలుగా అభివద్ధి పరిచినట్లు తెలిపారు. గ్రామస్తులు సంపూర్ణ సహాయ సహకారాలు తాము మరువలేమన్నారు. కార్పొరేట్ విద్య అందుబాటులో ఉన్నప్పటికీ



గ్రామస్తులు నేటికీ తమ పాఠశాల పట్ల మక్కువ చూపించడం మరువలేని అంశంగా పేర్కొన్నారు. 40 ఏళ్లుగా తమను ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికీ కతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. ఈ నాలుగు దశాబ్దాల కాలంలో స్థానికంగా చదువుకుని ప్రయోజనం పొందిన పలువురు తల్లిదండ్రులు వారి వారసులను తిరిగి తమ పాఠశాలలో చేర్పించడం తనకెంతో తప్తిని ఇస్తుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దటమే తన కర్తవ్యం అని సాయికిరణ్ పేర్కొన్నారు.

విలువలతో కూడిన విద్యే లక్ష్యం

ఆళ్ల సాంబశివరావు, ప్రిన్సిపల్, శ్రీసాయి విద్యానికేతన్

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

విలువలతో కూడిన విద్యే తమ లక్ష్యమని అమ్మనబ్రోలులోని శ్రీ సాయి విద్యానికేతన్ ప్రిన్సిపల్ ఆళ్ళ సాంబశివరావు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో పాఠశాలను స్థాపించి సాధారణ పీజులతో కార్పొరేట్ స్థాయిలో విద్యనందిస్తున్నట్లు తెలిపారు. సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు. 2023 పదోతరగతి పరీక్షా ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. పబ్బిశెట్టి లాస్య 576, గండు త్రివేణి 563 ,ముప్వా అక్షయ 561 మార్కులు సాధించినట్లు తెలిపారు. పోకూరి గాయత్రి 557, మన్నెం వైష్ణవి, చిరుపోతుల వెన్నెల 554 మార్కులు సాధించినట్లు తెలిపారు.



పబ్బిశెట్టి లాస్య



గండు త్రివేణి



ముప్వా అక్షయ

పరీక్షలకు మొత్తం 33 మంది హాజరు కాగా అందరూ ఉత్తీర్ణ సాధించినట్లు తెలిపారు. 30 మంది ప్రథమ శ్రేణి, ముగ్గురు ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారన్నారు తమ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడానికి కృషిఉపాధ్యాయులలు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ సందర్భంగా సాంబశివరావు అభినందనలు తెలిపారు.

సెమినార్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- కొమరోలు



మాట్లాడుతున్న రామకృష్ణ

వ్యవసాయ రంగంలో సంక్షోభం - పరిష్కార మార్గాలు అనే అంశంపై ఒంగోలులోని బృందావనం కల్యాణమండలంలో శుక్రవారం నిర్వహిస్తున్న సెమినార్‌ను జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం గిద్దలూరు ఏరియా కన్వీనర్ వి. రామకష్ణ కోరారు. మండల పరిధిలోని నల్లగుంట్ల గ్రామంలో ఎపి రైతు సంఘం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకష్ణ మాట్లాడుతూ ఈ సెమినార్‌లో మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటున్నట్లు తెలిపారు. అనంతరం సెమినార్ కు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ కన్వీనర్ చంద్రపాల్, బొడ్డు రామరాజు, కన్వీనర్లు మంద ప్రకాశం, చల్లా వెంకట రెడ్డి, కార్యవర్గ సభ్యులు నల్లగుంట్ల కాశయ్య, ఎద్దుల వెంకటేశ్వర రెడ్డి, గుర్రం సీమోను, షేక్ చాంద్ సాహెబ్, షేక్ బికారి సాహెబ్, షేక్ ఇమాం సాహెబ్, థామస్, రైతులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: వ్యవసాయ రంగంలో సంక్షోభం- పరిష్కార మార్గాల అనే అంశంపై ఒంగోలులోని బందావనం కల్యాణ మండపంలో శుక్రవారం సెమినార్ నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం మండల కార్యదర్శి జి. బసవపున్నయ్య, కౌలురైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జె జయంతిబాబు తెలిపారు. ఈ సెమినార్‌లో ముఖ్యఅతిథులుగా ఎఐకెఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ విజ్జు కష్ణన్ , ఆర్థిక, రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, ఎపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి. కష్ణయ్య, ఎపి కౌలురైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు పాల్గొనున్నట్లు వారు తెలిపారు. మండల పరిధిలోని రైతులు,కౌలురైతులు సెమినార్‌లో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.



మాట్లాడుతున్న ఎంపిపి వాకా అరుణ

సమస్యలు పరిష్కరించకుంటే చర్యలు తప్పవు : ఎంపిపి

ప్రజాశక్తి-మద్దిపాడు

సమస్యలు పరిష్కరించకుంటే చర్యలు తప్పవని ఎంపిపి వాకా అరుణ కోటిరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నట్లు తెలిపారు. దొడ్డవరప్పాడు గ్రామ సర్పంచి మాట్లాడుతూ సచివాలయ, రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణాలకు దాతలు భూమిని ఉచితంగా ఇచ్చినట్లు తెలిపారు. అయినప్పటికీ భవన నిర్మాణాలు చేపట్టలేదన్నారు. తొలుత ఇటీవల మృతిచెందిన ప్రజాశక్తి విలేకరి కాకుమాను అంజయ్యకు ప్రజాప్రతినిధులు, అధికారులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి టి. భాగ్యలక్ష్మి వైస్ ఎంపిపి పైడిపాటి వెంకట్రావు, మోరబోయిన విజయలక్ష్మి, ఎంపిటిసిలు వాకా కోటిరెడ్డి, పల్లకీ పద్మకుమారి, రావిపాటి వెంకట్ సుజాత,పల్లకి ఆదిలక్ష్మి ,రెబ్బవరం ప్రమీలా, బోయపాటి వీరాంజనేయులు అద్దేపల్లి దుర్గా భవానీ, ప్రభాకర్ బొమ్మల దేవదాసు, ఎంపిడిఒ .శ్రీనివాసరావు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన వ్యక్తి అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకొని హైదరాబాదులోని మంత్రి నివాసంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అనేక పదవులను చేపట్టిన జగ్జీవన్ రామ్ అన్ని పదవులకు వన్నెతెచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఒ చెన్నయ్య పాల్గొన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి చేదూరి విజయభాస్కర్, సర్పంచులు ఏకుల ముసలారెడ్డి, దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, తాలూకా ఎన్‌జిఒ అధ్యక్షుడు చేదూరి రవికుమార్, వైసిపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, డాక్టర్ వైస్సార్ క్రీడా అభివృద్ధి కమిటీ చైర్మన్ నర్రెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

జరుగుమల్లి : డాక్టర్ బాబూ జగజ్జీవనరామ్ వర్ధంతి స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, పెద ాబు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి నరాల సోమయ్య, నాయకులు చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, బలరామిరెడ్డి, నలమోతు వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు, కార్యకరత్తలు తదితరులు పాల్గొన్నారు. **దర్శి:** బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా తాళ్లూరు ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు, జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి తదితరులు జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భవితకేంద్రంలో జగ్జీన్‌రామ్ చిత్రపటానికి ఎంపిపి గోళ్లపాటి సుధారాణి, ఎడిఎ డాక్టర్ పురుషోత్తంరాజు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈకార్యక్ర మంలో ప్రేమ్‌కుమార్, ప్రసాద్, హనుమంతరావు, జూపల్లి కోటేశ్వరరావు, సుబ్రమణ్యం, గోళ్లపాటి అచ్చయ్య, తాళ్ళూరు మండల సర్పంచులు చార్లెస్ సర్జన్, వలి, శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపిపి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు ప్రభాకరరెడ్డి, శ్రీనివాసరావు, లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-దర్శి

స్థానిక కురిచేడు రోడ్‌లోని షిర్డిసాయిబాబా వృద్ధాశ్రయంలో వృద్ధులకు ముండ్లమూరు మండలం ఉమామహేశ్వరపురం గ్రామానికి చెందిన షేక్ ఖాశిం, హసీనా దంపతుల కుమార్తె ఖాశింబీ పుట్టినరోజు సందర్భంగా గురువారం అన్నదానం చేశారు. ఆశ్రమానికి 25 కేజీలు బియ్యం, కందిపప్పు, పండ్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

నేడు టిడిపి నాయకుల సమావేశం

ప్రజాశక్తి-పొన్నలూరు

స్థానిక కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు టిడిపి నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు తెలిపారు. ఈ సమావేశానికి కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, దామచర్ల సత్య హాజరు కానున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రెసిడెన్షియల్ స్కూల్‌లో తనిఖీ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్ద దోర్నాల పట్టణంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఐటిడిఎ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ బి రవీంద్రారెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్కూల్ లోని పరిసరాలను పరిశీలించారు. అనంరతం విద్యార్థులతో సమావేశ మయ్యారు. విద్యా ప్రమాణాలపై ఆరా తీశారు. పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి విలువైన సూచనలు అందించారు. 100 శాతం ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు.

ఉపాధి పనులు కల్పించాలి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండల పరిధిలోని అన్ని గిరిజన గూడేల్లోని ప్రజలకు ఉపాధి పనులు కల్పించాలని ఐటిడిఎ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ బి.రవీంద్రారెడ్డి ఆదేశించారు. నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాల పరిధిలోని ఉపాధి హామీ సిబ్బందితో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి గిరిజన కుటుంబానికి 150 రోజుల పని దినాలు వస్తాయన్నారు. 30 శాతం అలవెన్స్ కూడా వస్తుందని తెలిపారు. గిరిజనులను ఈ విషయంలో చైతన్య పరిచి ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ నారాయణరెడ్డి, ఐటిడిఎ ప్రాజెక్టు మేనేజర్ నాయక్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

అపరాధ రుసుం రద్దు

ప్రజాశక్తి-పొదిలి

అదనపు పొగాకు అమ్మకంపై అపరాధ రుసుం (పెనాల్టీ చార్జీలు) పూర్తిగా రద్దు చేస్తున్నట్లు పొగాకు బోర్డు వేలం కేంద్రం నిర్వహణ అధికారి గిరిరాజ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిఏారు. గుంటూరు పొగాకు బోర్డు ఆదేశాల మేరకు ఎలాంటి పెనాల్టీ ఛార్జీలు లేకుండా పొగాకు అమ్ము కోవడానికి అవకాశం కల్పిం చినట్లు ఆయన పేర్కొన్నారు. అధిక పొగాకు పంట పండించిన రైతులు స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని సంబంధిత ఫీల్డ్ అధికారికి అందజేసి పంటను అమ్ము కోవచ్చునని తెలిపారు.

ఫ్యాప్టో సదస్సును జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-సిఎస్.పురం

జీవో నంబరు 117ను రద్దు చేయాలని, ఉమ్మడి సీనియారిటీ ప్రకారం మెమో 1, 2 పదోన్నతులు కల్పించాలని కోరుతూ ఈనెల 9న ఒంగోలు నిర్వహిస్తున్న ఫ్యాప్టో సదస్సును జయప్రదం చేయాలని సిఎస్.పురం మండలశాఖ అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జెఎస్.ఆనంద్‌బాబు, జిల్లా కార్యదర్శి షేక్.నాయబ్‌రసూల్ కోరారు. ఈ సదస్సులో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలిన వారు కోరారు.

భవన నిర్మాణ కార్మికులకు

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు వినతి

ప్రజాశక్తి- కంభం రూరల్

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబుకు గురువారం వినతి పత్రం అందజేశారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెలను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భవనిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బి.రోశయ్య ,షేక్ ఖాజావలి మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న భవన మరియు ఇతర నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా అమలవుతున్న పథకాలను రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 1214 ద్వారా గత నాలుగు



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

సంవత్సరాల నుంచి నిలుపుదల చేసినట్లు తెలిపారు. దీంతో భవన మరియు ఇతర నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా కార్మికుడు చనిపోతే ప్రమాద బీమా ,60 సంవత్సరాలు నిండిన కార్మికులకు వద్ధాప్య పెన్షను, ,కార్మికుడి కుమార్తై వివాహానికి పెళ్లి కానుక, గృహ నిర్మాణానికి సంక్షేమ బోర్డు నుంచి లోన్లు , ఇతర సంక్షేమ పథకాలు ఆగిపోయినట్లు తెలిపారు.దీంతో స్పందించిన ఎమ్మెల్యే వెంకట రాంబాబు మాట్లాడుతూ సమస్యలను కార్మికుల పక్షాన నిలబడి ప్రభుత్వం దష్టికి పోతామని తెలిపారు. శాసన సభలో ఆ అంశంపై ప్రస్తావిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి.ఆవులయ్య, మండల కార్యదర్శి తత్తూరి దానం, భవన నిర్మాణ కార్మిక సంఘం కోశాధికారి జెర్మియా, భవనిర్మాణ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు ఎస్‌కె. మాబాషా, ఎస్‌డి.కొత్తూరు, భవనిర్మాణ కార్మికులు అచ్చయ్య ,వెంకటేశ్వర్లు, చెన్నయ్య ,రామకష్ణ , బాషా, శ్రీను , గంగిరెడ్డి , శ్రీనివాసరావు ,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి- నాగులుప్పలపాడు

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరిం చాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఎంఇఒ రవికి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ జగన్న గోరుముద్ద పేరుతో ప్రాథమిక పాఠశాలలు, హైస్కూళ్లలో విద్యార్థులకు ఇస్తున్న మెనూ ఛార్జీలతో సంబంధం లేకుండా రోజుకో మెనూ అందజేయాలని కార్మికులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిపారు. రాగిజావ ,సాంబార్ బాత్ లాంటి మెనూ తయారు చేయడానికి వంట పాత్రలు లేక, గ్యాస్ ధర పెరిగి కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఒక్కొక్క విద్యార్థికి రూ.20 మెనూ ఛార్జీ ఇవ్వాలన్నారు. కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో మధాహ్న భోజన పథకం కార్మికులు, సిఐటియు నాయకుడు జి.బసవపున్నయ్య తదితరులు పాల్గొన్నారు. **గిద్దలూరు రూరల్ :** మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంఇఒ కార్యాలయ పర్యవేక్షకుడు భాస్కర్‌కు వినతి



ఎంఇఒకు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం యూనియన్ నాయకులు కుమారి మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. ప్రతినెలా 5వ తేదీలోపు బిల్లులు ,వేతనాలు చెల్లించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు ప్రభుత్వమే వంటగ్యాస్ సిలిండర్ సబ్సిడీపై అందజేయాలన్నారు. మెనూ ఛార్జీ రూ. 20 రూపాయలకు పెంచాలనిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం యూనియన్ నాయకులు లక్ష్మి దేవి , నరసింహ, సరస్వతి , రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాదులో ఉన్న వాలంటీర్లకు ..

ఇక్కడ జీతాలు ఎలా ఇస్తారు ? : ఎంపిపి

ప్రజాశక్తి-సింగరాయకొండ

హైదరాబాదులో ఉన్న వాలంటీర్లకు ఇక్కడ జీతాలు ఎలా ఇస్తున్నారని ఎంపిపి కట్టా శోభారాణి ప్రశ్నించారు. మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఊళ్ళపాలెం వెళ్లితే ఆ సచివాలయ పరిధిలోని 10 మంది వాలంటీర్లు హైదరాబాదులో ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారన్నారు. హైదరాబాదులో ఉన్న వారికి ఇక్కడ జీతాలు ఎలా ఇస్తున్నారో చెప్పాలన్నారు. వాలంటీర్లు గ్రామాల్లోనే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు అందుబాటులో లేని వారిని తొలగించాలన్నారు. సుందర్ నగర్‌లో పాఠశాల మూత పడటంలో గిరిజన విద్యార్థులు బడికి పోకుండా ఇంటి వద్దే ఉంటున్నారని, అక్కడ పాఠశాల ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉన్నట్లు తెలిపారు. కొద్దిపాటి వర్షం పడినా గాలులు వీచినా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.ఎంపిడిఒ జమీఉల్లా మాట్లాడుతూ సక్రమంగా పనిచేయాలని వాలంటీర్లను జీవో నెంబర్ 4 ప్రకారం తొలగించే అధికారం పంచా యతీ కార్య దర్శులకు ఉన్నట్లు తెలిపారు. బింగినపల్లి సర్పంచి జెట్టి విజయలక్ష్మి మాట్లాడుతూ తమ



మాట్లాడుతున్న ఎంపిపి శోభారాణి

పంచాయతీలో మురుగనీరు పోయేందుకు డ్రైనేజీ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ యన్నాబత్తిన అరుణ మాట్లాడుతూ సోమరాజుపల్లి పంచాయతీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సామంతుల రవికుమార్‌రెడ్డి, ఎస్‌కె.షకీలా, కనుమల్ల సర్పంచి మలినేని ఇందిరా, శానంపూడి సర్పంచి బల్లెకుర బ్రహ్మయ్య, పాకల సర్పంచి బల్లెల ప్రభాకర్‌రెడ్డి, ఎంఇఒలు బి.శివన్నారాయణ, ఆవుల శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ జెఇ కోటా శ్రీహరి, కిషోర్, సిడిపిఒ మల్లీశ్వరి, కనుమల్ల సొసైటీ చైర్మన్ మలినేని వెంకటేశ్వర్లు, డాక్టర్ చైతన్యకష్ణ తదితరులు పాల్గొన్నారు.




రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పంటల సాగుపై అవగాహన

ప్రజాశక్తి-పిఎస్.పల్లి

మండల పరిధిలోని తలకొండపాడు రైతు భరోసా కేంద్రం వద్ద జిల్లా వనరుల కేంద్రం వారి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఖరీఫ్ సీజన్ పంటల సాగులో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, జాగ్రత్తలు, విత్తన ఎంపిక, విత్తనశుద్ధి తదితరాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఎఒ వి. వెంకట శేషమ్మ, ఎపిఎం, ప్రజాప్రతినిధులు, రైతులు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న రామయ్య శాస్త్రి

చంద్రభాస్కర శాస్త్రికి ఘన నివాళి

ప్రజాశక్తి- జరుగుమల్లి

మండల పరిధిలోని నర్సింగోలు గ్రామంలో జ్యోతిష్య శిరోమణి, జ్యోతిష్య బ్రహ్మర్షి సహస్ర నాగ శిలా ప్రతిష్టాపకులు డాక్టర్ జంద్యాల చంద్రభాస్కర శాస్త్రి వైకుంఠ సమారాధన గురువారం నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన డాక్టర్ జంద్యాల అనుచరులు పాల్గొని ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కంభం రూరల్

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయమని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు తెలిపారు. కంభం-2 సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడప గడపకూ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నర్సాయపాలెంలో మీ బాట-నా మాట

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల నియోజకవర్గంలో వేగేశన ఫౌండేషన్ ద్వారా ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలతో తమవంతు సేవలందిస్తున్నానని బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. గురువారం నర్సాయపాలెంలో ఇంటింటికీ తెలుగుదేశం మీ బాట-నా మాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తున్నా. మీ ఓటుతో నన్ను ఆశీర్వదించండని ఇంటింటికీ తిరిగి నరేంద్రవర్మ వివరిస్తున్నారు. ఈ సందర్భంగా నరేంద్రవర్మ మాట్లాడుతూ నర్సాయపాలెం తెలుగుదేశం పార్టీకి పట్టుగొమ్మగా నిలిచిందన్నారు. తెలుగుదేశం పార్టీకి మొదటి నుంచి ఈ గ్రామంలో బలమైన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. రాబోయే ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా కృషి చేసి గ్రామంలో పార్టీకి భారీ మెజారిటీ సాధించాలని



గ్రామస్తులతో మాట్లాడుతున్న నరేంద్రవర్మ

అన్నారు. వైసీపీ పాలనలో రైతులకు గిట్టుబాటు ధర లేక, సమయానికి ఎరువులు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. టిడిపి ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారెంటీ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే మహిళా శక్తి, యువ గళం, బీసీలకు రక్షణ చట్టం, రైతులకు అన్నదాత పథకాలను అమలు చేయడంతో పాటు, పేదలకు ఆర్థిక వెసులుబాటు కల్పించే విధంగా పార్టీ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

టిడిపి అధికారంలోకి వస్తే లంచాలు, అవినీతి కి తావు లేకుండా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా బాపట్ల నియోజకవర్గ అభివృద్ధివైపు కృషి చేద్దామన్నారు. తనపై నమ్మకంతో ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. నీతి, నిజాయితీగా పారదర్శక పాలన అందిస్తామని నరేంద్రవర్మ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ముక్కామల శివ, పార్టీ నాయకులు కామేపల్లి కృష్ణ బాబు, పార్టీ నాయకులు మహిళలు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు వ్యక్తిగత గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని డ్వాక్రా గ్రూప్ మహిళలకు వ్యక్తిగత గుర్తింపు కార్డులను అందజేస్తున్నట్లు ఏరియా కో ఆర్డినేటర్ పి రమాదేవి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సమాఖ్య కార్యనిర్వాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్రా స్వరాజ్యలక్ష్మి అధ్యక్షత వహించారు. రమాదేవి మాట్లాడుతూ విఓఏలు ప్రభుత్వ పథకాలు, ఆర్థిక లావాదేవీలు, సంఘాల బలోపేతంపై దృష్టి సారించాలని అన్నారు. సిఐఎఫ్, విఆర్ఎఫ్‌లకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలలో ఎలాంటి ప్రత్యక్ష, పరోక్ష జోక్యం చేసుకోరాదన్నారు. ఏపిఎం శ్రీమన్నారాయణ మాట్లాడారు. అనంతరం గ్రూప్ సభ్యుల వ్యక్తిగత గుర్తింపు కార్డులను యనిమేటర్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిసిలు రజని, సాంబయ్య, హనోక్ మండల సమాఖ్య కోశాధికారి చిలకా సామ్రాజ్యం, అకౌంటెంట్ బత్తుల శిరీషా ఉన్నారు.

పిఎసిఎస్ మాజీ ఉపాధ్యక్షుడు కొడాలి మృతి

ప్రజాశక్తి-చెరుకుపల్లి



మండల పరిధిలోని నడింపల్లి గ్రామానికి చెందిన పిఎసిఎస్ మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ రేషన్ డీలర్ కొడాలి ప్రభాకరరావు(59) (చిన్న) బుధవారం సాయంత్రం గుండెపోటుతో హఠాత్తుగా మృతి చెందారు. గ్రామంలో ప్రముఖ నాయకునిగా పేరుపొందిన ప్రభాకర్‌రావు మృతి బాధాకరమని మాజీ శాసనసభ్యులు, బుడ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, మాజీ శాసనసభ్యులు ముమ్మనేని వెంకటసుబ్బయ్య, రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ తదితరులు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. చెరుకుపల్లి ఎంపిపి రత్నప్రసాద్, మాజీ ఎంపిపి చన్ను కోటేశ్వరరావు, రేషన్ డీలర్ల నాయకుడు రావూరి శివ నాగేశ్వరరావు, రవివర్మరెడ్డి, గ్రామస్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

పథకాలు అందించడమే జగనన్న సురక్ష లక్ష్యం

ప్రజాశక్తి-నిజాంపట్నం

అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వైసీపీ నాయకులు మోపిదేవి హరనాథ్ బాబు, జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య, తహశీల్దార్ నెహ్రూబాబు, ఎంపీడీవో ఎస్ నాగలక్ష్మి తెలిపారు. గురువారం మండలంలోని కూచినపూడి, గరువుపాలెం గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వారు పాల్గొని పలువురికి వివిధ రకాల పత్రాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందించాలన్న లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ ప్రారంభించారని చెప్పారు. గతంలో సాంకేతిక తప్పిదాల వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారులకు ఇది ఒక మంచి అవకాశమన్నారు. ఇంకా ఎవరైనా అర్హులు ఉండి సంక్షేమ పథకాలు పొందని వారు ఉంటే వారిని వలంటీర్లు, సచివాలయ సిబ్బంది గుర్తించి నేరుగా వారి ఇంటింటికి సందర్శించి వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు పొందేలా చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లపాటి రామయ్య, బండారు రామారావు, సర్పంచులు రాజేశ్వరి, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు శ్రీరామరక్ష అని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష పథకాన్ని తీసుకువచ్చారని శాప్ నెట్ చైర్మన్, వైసిపి అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. గురువారం మండల పరిధిలోని గుంటుపల్లి ముక్తేశ్వరం గ్రామాలలో వైఎస్ఆర్ సురక్ష పథకం ద్వారా మంజూరైన ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా లంచాలకు, వివక్షకు తావు లేకుండా వందకు వంద శాతం పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందజేయాలనే పట్టుదలతో గడప గడపకూ మన ప్రభుత్వం జగనన్న సురక్ష లాంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు ఏమైనా ఉంటే తెలుసుకుని పరిష్కారం చూపించే దిశగా చేస్తున్న వినూత్న కార్యక్రమమే జగనన్న సురక్ష అని అన్నారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు.

పశుపక్ష్యాదుల నుంచి..

వ్యాధులు సంక్రమించకుండా చర్యలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా గురువారం బాపట్ల ప్రాంతీయ వైద్యశాల ఆవరణలో పెంపుడు కుక్కలకు ఉచిత టీకాలు వేసే కార్యక్రమం చేపట్టారు. జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో రైతులకు, వైద్య సిబ్బందికి అవగాహనా కార్యక్రమం చేపట్టారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎం హనుమంతరావు మాట్లాడుతూ పశుపక్ష్యాదుల నుంచి ప్రజలకు వ్యాధులు సంక్రమించకుండా అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జంతువుల నుంచి ప్రజలకు పలు వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా పెంపుడు కుక్కల నుంచి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉన్నందున ప్రత్యేకంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నామన్నారు. పక్షుల నుంచి బర్డ్ ఫ్లూ వ్యాధి సంక్రమించకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, డిఐఓ డాక్టర్ టి వెంకటేశ్వర్లు, డాక్టర్ నళిని, డాక్టర్ టి శంకరరావు, డిప్యూటీ ఫారెస్టు రేంజ్ అధికారి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె: జునోసిస్ వ్యాధులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. జునోసిస్ డే సందర్భంగా తుమ్మల గ్రామంలో పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు ఉచితంగా వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ సుమారు 250



పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి

వ్యాధులు పశువుల ద్వారానే సంక్రమిస్తున్నాయని చెప్పారు. ఈ వ్యాధులు మానవులకు ప్రబలకుండా ఉండాలంటే పెంపుడు జంతువులకు సకాలంలో టీకాలు వేయించాలన్నారు. పశువుల పాకలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పెంపుడు కుక్కలకు ఉచితంగా అందించే రేబిస్ టీకాలను వేయించుకోవాలని కోరారు. జంతువుల నుంచి ప్రజలకు పలు వ్యాధులు సంక్రమిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ముఖ్యంగా పెంపుడు కుక్కల నుంచి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉన్నందున ప్రత్యేకంగా వ్యాధి నిరోధక టీకాలు వేయాలన్నారు. ఇందుకోసం అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పశువైద్యశాలల్లో టీకాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

జాస్మిన్ హత్య కేసును సీబీఐతో విచారించాలి

సీఎం న్యాయం చేయాలని బాధిత కుటుంబాల వినతి ● ముస్లిం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సమావేశం

ప్రజాశక్తి-రేపల్లె

జాస్మిన్ హత్య కేసును సిబిఐతో విచారించాలని పలువురు ముస్లిం అభివృద్ధి కమిటీ నాయకులు కోరారు. పట్టణంలోని ఈద్గా మైదానంలో గురువారం ముస్లిం పెద్దలు సమావేశం నిర్వహించారు. జైలు శిక్ష పడిన నిజాంపట్నం మండలం అడవులదీవి మహమ్మదీయ పాలేనికి చెందిన బాధిత కుటుంబాలను ఆదుకుంటామని నియోజకవర్గ ముస్లిం అభివృద్ధి కమిటీ సభ్యులు షేక్ జమీర్ తెలిపారు. ఈ సందర్భంగా 2016లో అడవులదీవి మహమ్మదీయపాలెంలో జరిగిన శ్రీసాయి హత్య కేసులో గత నెల జూన్ 21న శిక్ష పడిన ముద్దాయిల కుటుంబ సభ్యులకు ముస్లిములు ఆర్థికంగా అండగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం జమీర్ మాట్లాడుతూ 2016లో జాస్మిన్‌ను హత్య చేశారని ఆగ్రహించిన కుటుంబీకులు, గ్రామస్తులు కలిసి వేముల శ్రీసాయి, జొన్న పవన్ కుమార్‌లను నిర్బంధించారని చెప్పారు. ఆడపిల్లను అన్యాయంగా చంపేశారనే ఆవేశంలో జరిగిన ఘటనలో శ్రీసాయి మరణించాడని తెలిపారు. ఒకేరోజు కొన్ని గంటల వ్యవధిలో జాస్మిన్, శ్రీసాయి దురదృష్టకర ఘటనలో మరణించడం బాధాకరమని అన్నారు. అయితే అప్పటి పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించి జాస్మిన్ హత్య కేసును నీరుగార్చారని, శ్రీసాయి కేసును హత్య కేసుగా మలిచారని ఆరోపించారు. 13 మంది ముస్లిం కుటుంబాలకు చెందిన వారికి జీవిత ఖైదు విధించి, ఊరు మొత్తాన్ని బలి చేశారని విమర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈద్గా కమిటీ అధ్యక్షులు జమీర్

తమకు రాజ్యాంగ వ్యవస్థలపైన, కోర్టు తీర్పులపైన అపారమైన గౌరవం ఉందని అన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ఇద్దరికీ న్యాయం చేయాల్సిన పోలీసులు మైనార్టీలకు అన్యాయం చేశారని అన్నారు. జైలు శిక్ష పడిన కుటుంబాలు నిరుపేదలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి న్యాయం చేసి, ఆర్థికంగా వారిని ఆదుకోవాలని కోరారు. బాధిత కుటుంబాలకు మగదిక్కులేదని, పసిపిల్లలు ఉన్నారని, ప్రభుత్వం చొరవ తీసుకుని జాస్మిన్ కేసును సీబీఐతో విచారణ జరిపించి న్యాయం చేయాలని బాధిత కుటుంబ మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. సమావేశంలో ముస్లిం అభివృద్ధి కమిటీ నాయకులు ఫరీద్, మొహిద్దీన్, సలీం బాషా, రబ్బాని, తయ్యూబ్, తాహెర్ అహమ్మద్, సుభాని, బాధిత కుటుంబ మహిళలు పాల్గొన్నారు.

చిట్టెమ్మ చిత్రపటానికి నివాళి

ప్రజాశక్తి-బాపట్ల: కమ్యూనిస్టు ఉద్యమ నేత కామ్రేడ్ మండవ వెంకటసుబ్బయ్య సతీమణి చిట్టెమ్మ చిత్రపటానికి గురువారం బాపట్ల ప్రజాసంఘాల కార్యాలయంలో పార్టీ నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు మాట్లాడుతూ సిపిఎం తొలితరం అగ్రనేతలు పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య, మోటూరు హనుమంతరావు, లావు బాలగంగాధరరావు, కొరటాల సత్యనారాయణ, మల్లు స్వరాజ్యం వంటి నాయకుల నుంచి నేటి బీవీ రాఘవులు, పి మధు, వి శ్రీనివాసరావు, డి రమాదేవి వంటి నేతలకు చిట్టెమ్మ సుపరిచితురాలిగా నిలిచారు. ఆమె మరణానంతరం పార్థివ దేహాన్ని భవిష్యత్తు వైద్యులకు ఉపయోగపడే విధంగా గుంటూరు మెడికల్ కళాశాలకు దానం చేశారన్నారు. ఆమెకు తమ బంధువులు కన్నా కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలంటేనే అమితంగా అభిమానించేవారన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్, కే నాగేశ్వరరావు, సుభాషిణి, ఆర్య, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు సత్వర సేవలు

ప్రజాశక్తి-వేటపాలెం

తక్షణ సేవలు అందించడానికి జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏర్పాటు చేసినట్టు చీరాల వైసిపి ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ బాబు తెలిపారు. గురువారం మండల పరిధిలోని పందిళ్లపల్లి, కొత్తపేట సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. రానున్న ఎన్నికలలో జగనన్నకు పట్టం కట్టే విధంగా ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. ఈ సందర్భంగా పందిళ్లపల్లి గ్రామ సచివాలయంలో ఆదాయ, కుల, వన్ బి అడంగల్ ధ్రువపత్రాలను 70 మందికి అందించారు. కొత్తపేట గ్రామ సచివాలయంలో 170 మందికి ఆదాయ, కుల అడంగల్ ధ్రువపత్రాలను అందించారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎమ్మెల్యే కోన రఘుపతి

'జగనన్న సురక్ష'తో

పరిపాలనా వ్యవస్థ ఇంటి ముందుకు..

కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జగనన్న సురక్ష కార్యక్రమంతో పరిపాలన వ్యవస్థ ప్రజల ఇంటి ముందుకు వచ్చిందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమం స్థానిక బాపట్ల మండలం, కంకటపాలెం శుభం కళ్యాణ మండపంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా చేతుల మీదుగా 884 సర్టిఫికెట్లను స్థానిక ప్రజలకు అందజేశారు. తదుపరి అమ్మఒడి పథకం కింద మండలంలోని 5,944 మంది లబ్ధిదారులకు రూ.8.9 కోట్ల నగదును చెక్కు రూపంలో పంపిణీ చేశారు. స్థానికంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్లు, అందుతున్న సేవలపై ఆరాతీశారు. ప్రజలతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హత కలిగిన వారం దరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేయడం, కుల, ఆదాయ, తదితర 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ప్రజలకు ఉచితంగా అందించడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి మాట్లాడుతూ అన్ని రాష్ట్రాలు, ఇతర దేశాలు సైతం ఏపీని ఆదర్శంగా తీసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బాపట్ల మండల ప్రత్యేక అధికారి డిఇఒ రామారావు, బాపట్ల ఆర్డిఓ జి రవీందర్, ఉప తహసిల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో రాధాకష్ణ, ఎంపీపీ హరిబాబు, సర్పంచ్ అన్నమ్మ పాల్గొన్నారు.

ప్రమాద ఘటనలు పునరావృతం కానీయొద్దు

- సిఐటియు నాయకుల డిమాండ్
- 16 మంది బాధితులూ డిశ్చార్జ్

ప్రజాశక్తి-జరుగుమల్లి, ఒంగోలు కలెక్టరేట్

ముస్నంగి సీఫుడ్స్‌లో సంఘటనలు పునరావృతం కాకుండా సీఫుడ్స్ యాజమాన్యం చర్యలు చేపట్టాలని సిఐటియు ప్రకాశం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం ఉదయం ఐదు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట దాకా తీవ్రమైన జ్వరాలతో బాడీ పెయిన్స్‌తో, అస్వస్థతకు గురై.. ఒంగోలు రిమ్స్ వైద్యశాలలో 16 మంది మహిళా కార్మికులు చేరిన విషయం తెలిసిందే.. వీరిని సిఐటియు జిల్లా కమిటీ పరామర్శించి ధైర్యం చెప్పారు. గురువారం నాడు ముస్నంగి సీ ఫుడ్స్ కర్మాగారం వద్దకు సిఐటియు బృందం వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు టంగుటూరి రాము, కెవిపిఎస్ ఉపాధ్యక్షులు, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అయ్యపరెడ్డి ముస్నంగి సీఫుడ్స్‌లోకి వెళ్లి పరిశీలన చేశారు. అక్కడి యాజమాన్యం శ్రీనివాసరావు, టి.రామారావుతో, సిబ్బందితో మాట్లాడారు. ఆ 16 మందికి వేతనంతో కూడిన సెలవుతో పాటు అదనంగా ఒక నెల వేతనం ఇచ్చి వారు పూర్తిగా కోలుకునే విధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవాలన్నారు. దాదాపు 600 మంది పనిచేసే ఫ్యాక్టరీలో సౌకర్యాలు, భద్రత, ఇతర విషయాలలో జాగ్రత్తలు తీసుకోకపోతే చాలా ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. మేనేజ్‌మెంట్ 16 మందికి రక్తపరీక్షలు నిర్వహించి.. రిపోర్టులు బహిర్గతం చేయాలన్నారు. ఒంటి నొప్పులు ఎందుకొస్తున్నాయి నిర్ధారణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. బాధితులకు మెరుగైన వైద్యం కల్పించాలని డిమాండ్ చేశారు.



ముస్నంగి సీఫుడ్స్ యాజమాన్యంతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

అధికారుల పరిశీలన

సీఫుడ్స్ కంపెనీని ఒంగోలు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ యస్.శ్రీనివాసరావు, సహాయ కమిషనర్లు కోటేశ్వరరావు, కె.పవన్ కుమార్, బి.అనితావాణి పరిశీలించారు.

16 మంది బాధితులు డిశ్చార్జ్

ముస్నంగి సీ ఫుడ్స్‌లో గ్యాస్ లీకేజీలో అస్వస్థతకు గురైన బాధిత మహిళలు కోలుకోవటంతో గురువారం రాత్రి వారిని డిశ్చార్జ్ చేశారు. ఈ నెల 5వ తేదీన వావిలేటిపాడు ముస్నంగి సీ ఫుడ్స్‌లో గ్యాస్ లీకేజీ కారణంగా ఒడిశా, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 16 మంది మహిళలు అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. వారికి ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల క్యాజువాలిటీలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్సలు అందించారు. బాధిత మహిళలకు గురువారం మహిళలకు మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ రక్త పరీక్షలు నిర్వహించగా, నెగిటివ్ రిపోర్ట్ వచ్చింది. దీంతో బాధిత మహిళలను డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.భగవాన్‌నాయక్ మాట్లాడుతూ కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు గ్యాస్ లీకేజీలో అస్వస్థతకు గురైన బాధిత మహిళలకు మెరుగైన వైద్యసేవలు అందించామన్నారు. బాధిత మహిళలకు ఎలాంటి ప్రాణాపాయం లేదని తెలియజేశారు. బాధిత మహిళలకు మరోసారి వైద్య పరీక్షలు నిర్వహించి గురువారం రాత్రి డిశ్చార్జ్ చేసినట్లు పేర్కొన్నారు.

ఏపీజీబీ రీజనల్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-మార్కాపురం

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు రీజనల్ కార్యాలయాన్ని మార్కాపురం పట్టణంలో ఆ బ్యాంకు చైర్మన్ రాఖేష్ కాశ్యప్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాఖేష్ కాశ్యప్ విలేకరులతో మాట్లాడారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలోని మొత్తం 50 శాఖల పర్యవేక్షణ మార్కాపురం రీజనల్ ఆఫీసు ద్వారా జరుగుతుందని తెలిపారు. రుణ వితరణ సులభతరం చేసేందుకు వీలుగా సరళ రుణ కేంద్రం అనే వ్యవస్థను కూడా గురువారం ప్రాంతీయ కార్యాలయ ఆవరణలో ప్రారంభించడం జరిగిందని చెప్పారు. ఈ సందర్భంగా విద్య, గహ నిర్మాణం పాడి పరిశ్రమ, ట్రాక్టర్ కొనుగోలు, వాహన కొనుగోలు కొరకు 14 మంది ఖాతాదారులకు రూ.3 కోట్ల రుణాలను చైర్మన్ రాఖేష్ కాశ్యప్ అందించారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, సీనియర్ మేనేజర్ సంతోష్ వందన, ఒంగోలు, మార్కాపురం రీజినల్ మేనేజర్లు హేమలత, ఇ.శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.



రీజనల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాఖేష్

స్పోర్ట్స్ కోటా రద్దు వద్దు..: డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఉద్యోగాలలో క్రీడాకోటాను రద్దు, మెడలిస్టులకు ప్రోత్సాహకాలు, ఆర్థిక సాయం 2023-2028 క్రీడా పాలసీలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె ఎఫ్ బాబు డిమాండ్ చేశారు. స్థానిక పివిఆర్ గ్రౌండ్స్‌లో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్ బాబు మాట్లాడుతూ ఉద్యోగాల భర్తీలో ఇప్పటివరకు అమలు చేస్తున్న క్రీడల కోటాను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయనున్నట్లు క్రీడల శాఖ మంత్రి ఆర్‌కె రోజా వెల్లడించారన్నారు. ఇప్పటికే పలువురు అధికారులు, క్రీడా నిపుణులతో కూడా ప్రభుత్వం చర్చలు నిర్వహించిందన్నారు.



ధర్నాలో పాల్గొన్న నాయకులు, విద్యార్థులు

ఇదే సమయంలో ఆటగాళ్లకు ఉద్యోగావకాశాలపై కూడా అధికారులు లాంఛనంగా కీలక నిర్ణయం తీసుకున్నారన్నారు. పతకాలు సాధించిన వారికి కేవలం ప్రోత్సాహకాలు, ఆర్థిక సాయం మాత్రమే అందించాలని నిర్ణయించడం దారుణమన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర కార్యదర్శి వై..దానియేలు, అధ్యక్షులు పి.కిరణ్ ఉపాధ్యక్షులు విజయ్, వి.కార్తిక్. క్రీడాకారులు పాల్గొన్నారు.

పిఎల్‌ఆర్ ప్రసాద్‌కు కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి-ఒంగోలు, చీమకుర్తి

పిఎల్‌ఆర్ బ్రదర్స్ సంస్థల అధినేత పంగులూరి ప్రసాదరావు అంత్యక్రియలు గురువారం నిర్వహించారు. ఒంగోలులోని చెన్నకేశవనగర్‌లోని ప్రసాదరావు నివాసం నుంచి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మహాప్రస్థానం వరకు అంతిమయాత్ర సాగింది. అంతిమయాత్రలో పలువురు ప్రముఖులు పాల్గొని నివాళులర్పించారు. ప్రసాదరావు కుటుంబసభ్యులు పంగులూరి అన్వేష్ శిరీష దంపతులను, పంగులూరి ప్రభాకర్ దంపతులను, పంగులూరి శ్రీకాంత్ దంపతులను, మన్నం సుబ్బారావు దంపతులను, సింగమనేని అనూష హరీష్ దంపతులను, కల్లూరి అంజిబాబు దంపతులను, డాక్టర్ కల్లూరి వెంకటేశ్వర్లు దంపతులను పరామర్శించారు.

ముందుగా ప్రసాద్ మృతదేహం వద్ద ప్రజాశక్తి ఎడిటర్ తులసీదాస్, సిజిఎం అచ్యుతరావు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ప్రజాశక్తి జిఎంలు తిరుపాల్‌రెడ్డి, హరికిషోర్, ఎంఎల్‌వి.ప్రసాదరావు, గడ్డన్న, నవ తెలంగాణా జిఎంలు భరత్, వెంకటేష్, తెలంగాణా జర్నలిస్టు సంఘం నాయకులు బసవపున్నయ్య, సిపిఎం నాయకులు పూనాటి ఆంజనేయులు, జాలా అంజయ్య, ఎస్‌కె.మాబు, జివి.కొండారెడ్డి, సిపిఐ నాయకులు వెంకయ్య, ప్రజాశక్తి బ్యూరో ఇన్‌ఛార్జి ఎస్‌వి.బ్రహ్మం, మాజీ ఎమ్మెల్యే బిఎన్.విజయకుమార్, గ్రంథాలయ మాజీ చైర్మన్ వైవి.సుబ్బారావు, టిడిపి నాయకులు పమిడి రమేష్‌బాబు, బొమ్మినేని రామాంజనేయులు, కంకర మిల్లుల అసోసియేషన్ నాయకులు బొమ్మిశెట్టి మధుసూధనరావు, మేదరమెట్ల శ్రీనివాసులు, దుద్దుకూరి బ్రహ్మయ్య, గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పల్లవ సుబ్బారెడ్డి, నాయకులు చలువాది బదరీనారాయణ, బిఎంఆర్ శంకరరావు ఉన్నారు. విదేశాల్లో ఉన్న నల్లూరి ఫౌండేషన్ అధినేత, ప్రవాస భారతీయులు నల్లూరి వెంకటశేషయ్య ఫోను ద్వారా ప్రసాదరావు కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రసాదరావు స్వగ్రామం మండలంలోని కెవిపాలెం నుంచి, చీమకుర్తి నుంచి పలువురు మిత్రులు, శ్రేయాభిలాషులు అధికసంఖ్యలో ఒంగోలు వెళ్లి.. అంత్యక్రియలలో పాల్గొన్నారు.



పిఎల్‌ఆర్ ప్రసాద్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాశక్తి ఎడిటర్ తులసీదాస్



ప్రసాద్ అంతిమయాత్ర దృశ్యం